# కొయ్యబొమ్మ

**నా**కు వూహ తెలిసీ తెలియని వయసు.

నేను లేవగానే నాకు స్నానం చేయించి, బట్టలు తొడిగి, తలదువ్వి, ముచ్చటగా బొట్టు పెట్టి, నన్నెత్తుకుని అన్నం తినిపించబోతే తిననని మారాం చేస్తే పాటలు పాడి గోరుముద్దలు నా చేత తినిపించి, "నాకు మరి పిల్లల్లక్కరలేదు, వీడే నా కొడుకని, రోజంతా చంకనేసుకుని ఆడించి, రాత్రి కూడా తన పక్కలోనే పడుకోబెట్టుకుని నేననే ముద్దు మాటలకు పొంగిపోయి, నా చిన్ని కాళ్ళతో తన గుండెలమీద నేను తంతుంటే "ఛీ ఆకతాయి, వెధవా" అని - నా బూరి బుగ్గల్ని పట్టుకుని లాగి నేను గీపెట్టి ఏడుస్తుంటే నన్ను వూరడించడానికి నానా తంటాలు పడేది పిన్ని.

మామూలుగా బళ్ళో వేసినా, నేను బళ్ళోకెళ్ళేవాణ్ణి కాదు. పిన్నే నాకు అన్నీ దగ్గరుండి నేర్పేది. తోటి పిల్లలతోపాటు మామూలుగా పిన్నిని నేను పిన్నీ అనే పిల్చేవాడ్ని. "ఒరేనన్ను పిన్నీ అని అన్నావంటే గిచ్చుతాను చూడు..." పిర్రమీద గిచ్చి "అమ్మంటావా అనవా..." అని 'అమ్మ' 'అమ్మ' అని తనతో అన్పించుకుని పొంగిపోయేది పిన్ని.

నన్ను విడిచి పిన్ని ఒక్క క్షణం ఉండేది కాదు. పిన్ని కనబడకపోతే గదులన్నీ వెదికి పెరట్లో నిమ్మ చెట్టు కింద కూడా కనబడకపోతే "పిన్నీ....నీ" ఏడ్చేవాడు తను. ఒక్కొక్కప్పుడు తను బైటకెళ్ళి తోటి పిల్లలతో అడుకుని వస్తున్నప్పుడు కోరుండి దాక్కునేది. వెంటనే నా ఏడుపు చూసి 'మానాయనే' అని రెండు చేతులూ పట్టుకుని, ఆకాశం వైపు ఎగరేసి, గుండెకు గట్టిగా అదుముకుని, ముద్దు పెట్టుకునేది. అప్పుడప్పుడు ఏదైనా పనుండి పిన్ని, బజారులోకి వెళితే కనబడేది కాదు. పిన్ని కనబడిందాకా తనా నిమ్మ చెట్టు క్రింద అలా ఏడుస్తూ కూర్చునేవాడు. ఎవరు వూరుకోబెట్టినా వూరుకునేవాడు కాదు.

పిన్నిని చూస్తే తన కెంతో ఇష్టం.

ఆ అయిదేళ్ళప్పుడే పిన్ని ఎంతో అందంగా కనబడేది. సన్నగా పొడవుగా, పెరట్లో నిమ్మపళ్ళ ఛాయలో ఉండేది పిన్ని. పెద్ద కళ్ళు, సన్నంగా చూపుడు వేలంత ముక్కు, ఆ ముక్కు చివర మిలమిల మెరుస్తూ తెల్లటి ముత్యం, చెవులకి బంగారు దుద్దులు. ఎవరైనా చుట్టాలింటికి వెళితే పిన్ని పాపిట బింది, మెలికల వడ్డాణం, చిరుగంటల పట్టీలు పెట్టుకునేది. అప్పుడు పిన్నిని చూస్తే, మా ఇంట్లో గోడకున్న కేలండరు బొమ్మగుర్తు కొచ్చేది. ఆ కేలండర్లో లక్ష్మీ దేవి వంటినిండా రకరకాల ఆభరణాల్ని అలంకరించుకుని, అలాగే నిలబడేది. అచ్చు అలాగే ఉండేది పిన్ని.

నా చిన్నప్పుడే బావాజీ పోయారట. అప్పణ్ణించీ అమ్మనీ, నన్నూ, చెల్లినీ చిన్నాన్న చూస్తున్నారు.

చిన్నాన్నకు వ్యవసాయం. తెల్లగా పొడవుగా భారీగా ఉండేవారాయన. చెవులకి తమ్మెట్లుండేవి. అవి తెల్ల పొళ్ళతో తళతళా మెరుస్తుండేవి. చిన్నప్పటినుంచీ తనకు చిన్నాన్నంటే భయమే. ముద్దుగున్నానని ఎప్పుడైనా ఆయన ఎత్తుకుంటే సైరన్ కూతలా ఒకటే ఏడుపట.

"ఎందుకలా ఏడిపిస్తారు... నా చిట్టి తండ్రినీ" పిన్ని చిన్నాన్న నుంచి తనని తీసుకుని వూరుకోబెట్టేదట.

నాకు చిన్నప్పుడు జరిగిన విషయాలన్నీ జ్ఞాపకం ఉన్నాయి. ఎందుకో కొన్ని విషయాలు జీవితంలో మరచిపోలేని గుర్తులుగా మిగిలిపోతాయి. అవి బ్రతుకు చివరంటా కాలినకలల్లా వెంటాడుతూనే ఉంటాయి.

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం ఉంది.

తొలిరోజు రాత్రి పిన్నే నాకు అన్నం తినిపించి జోల పాడింది. కమ్మని పాట వింటూ అలా పిన్ని భుజం మీదే పడుకుండిపోయాడు తను.

ఉదయం -

ఎవరు పడుకోబెట్టారో అమ్మ పడుకునే చోట దేవుడి గదిలో మూలన ఉన్నాడు తను. లేవగానే ఏడుపులు, మొర్రోలు వినబడితే దేవుడి గది ద్వారబంధం వరకు వచ్చి నిలబడి పోయాడు. ఒక్కసారి భయమేసింది తనకి. పెద్ద గదిలో చిన్నాన్న భయంకరంగా కర్ర పట్టుకుని నిలబడ్డాడు. ఆయన్ని అడ్డుతూ చేతులు చాచి అమ్మ నిలబడింది.

తనతో ఆటలాడి, నిద్రపుచ్చి, అన్నం తినిపించి, కమ్మగా పాట పాడే పిన్ని

గొంతు ఏడుపుగా వినిపిస్తోంది. ఏడుస్తూనే పిన్ని ఏమో అంటోంది. "నాకు తెలీదు... నిజంగా నాకు తెలీదండి... నన్ను ... నమ్మండి.."

"ఏవీ తెలీకపోతే ఇవ్వన్నీ ఏవిటే... ఈ ఉత్తరాలన్నీ ఎక్కణ్ణుంచొచ్చాయే. గాలికి ఎగురుకుంటూ వచ్చాయా... కాళ్ళొచ్చి నడిచొచ్చాయా... ఎలా గొచ్చాయ్ చెప్పు... " అడ్డుకుంటున్న అమ్మని పక్కకు తోసేసి కొమ్ములతో పొడవడానికి వెళ్ళే గేదెలా చిన్నాన్న సరుగుడు కఱ్రతో మళ్ళీ కొట్టాడు. కొడుతూ తిడుతున్నాడు.

"వూరుకో కృష్ణమూర్తి... వూరుకో..." అమ్మ మాటల్ని లెక్క చెయ్యకుండా కొడుతున్నాడు.

పిన్ని అరుస్తూనే ఉంది. అరుస్తూ "నా కేం తెలీదు భగవంతుడా" అంటూనే ఉంది.

"మధ్యన వాడెందుకు... చేసిన పాపం చేసెయ్యడం... వాడెవడో కనబడని వాడి మీద తోసెయ్యడం..." గోడకి చీపురు కట్టలా బలంగా అంటుకు పోయిన పిన్నిని రెక్క పట్టుకుని బరబరా గది మధ్యకు లాక్కొచ్చి కాళ్ళెత్తి రాక్షసుడిలాతన్నాడు చిన్నాన్న.

"నిజం చెప్పు. ఎన్నాళ్ళ బట్టి సాగుతోంది నాటకం... చెప్పు... వాడితో, పెళ్ళవక ముందు నుంచీ ఉందా, చెబుతావా... లేదా.." జుట్టు పట్టుకుని ఈడ్చి, బంతిలా గోడకేసి విసిరి కొట్టాడు. ఎంత రాక్షసంగా హృదయం లేకుండా కొడుతున్నా పిన్నిది ఒకటే మాట -

"నా కేం తెలీదు మొఱ్రో..."

తను భయంతో కళ్ళు మూసేసుకున్నాడు. అమ్మ కాబోలు తన దగ్గర కొచ్చి తన నెత్తుకుని పెరట్లో కొచ్చేసింది. చిన్నాన్న పిన్నిని కొట్టడం ఆపి సావిట్లోకి వెళ్ళిపోయాడు.

మధ్య గదిలో పిన్ని ఏడుపు చాలా సేపటి వరకూ మౌనంగా గుండె ద్రవించేటట్టు వినిపిస్తూనే ఉంది. అప్పట్లో తనకు అదేవిటో అర్థం కాలేదు. ఎందుకో పిన్నేడుస్తుంటే తనకీ ఏడుపొచ్చింది. ఏడ్చేశాడుకూడా.

ఆ రోజు సాయంత్రం ఒక్కడూ ఒంటరిగా నిమ్మచెట్టు రాయి మీద గొంతుకిలా కూర్చుని కాళ్ళల్లో బుఱ్ఱ పెట్టుకుని ఆలోచిస్తున్నాడు తను పిన్నిని చిన్నాన్న ఎందుకలా కొట్టాడా అని.

ఆ దృశ్యం ఇంకా జ్ఞాపకం ఉంది తనకు.

"పెళ్ళాం చచ్చిపోయిందేవిట్రా అలా.. కూర్చున్నావ్..." తలెత్తి చూశాడు తను.

పిన్ని.

నవ్వుతూంది.

ఉదయం ఎన్ని దెబ్బలు తింది. అమ్మ కొడితే తను ఏడ్చినట్టుగా ఏడిచింది. చిన్నాన్నకి అసలు హృదయం లేదు. రాక్షసుడిలా అగుపించాడు. మధ్యాహ్నందాకా ఏడ్చిన పిన్ని కళ్ళు వాచిపోయాయి. పచ్చటి ముఖం ఎర్రగా బాదంపండు రంగులో కొత్తగా ఉంది. చెంపమీద చిన్నాన్న కొట్టిన దెబ్బల తాలూకు మచ్చలు తట్లు తేలి కనిపిస్తూనే ఉన్నాయి. పట్టులాంటి మెత్తగా, అందంగా గులాబీ రంగులో ఉండే పిన్ని బుగ్గల మీద కొట్టడానికి చిన్నాన్న కెంత బుద్ధిలేదో ఇప్పుడు తలుచుకుంటే తనకు ఆశ్చర్యం వేస్తుంది.

అదే నవ్వు.

పిన్ని నవ్వే, ఆ నవ్వంటే ఇప్పటికీ తన కిష్టమే. పిన్ని నవ్వినప్పుడు తెల్లటి పళ్ళు మెరుస్తూ బియ్యపు గింజల్లా కనబడతాయి. అదో అందం. అలా నవ్వడం పిన్ని ప్రత్యేకత.

"రా...రా... చిట్టికొండ... చిన్నాన్న నన్ను కొట్టడం చూసి ఝడిసి పోయావా... బుజ్జీ ... " తన బుగ్గ మీద ముద్దు పెట్టుకుని అంది.

'ఔ' నన్నట్టుగా తలూపాడు తను.

"మీ చిన్నాన్న మంచివారు కారేం. దేవుడితో చెప్పి కొట్టించేద్దాం, ఏం..."

"దేవుడితో ఎప్పుడు చెబుదాం. నేనొస్తాన్నీతో ... పిన్నీ...చిన్నాన్న గురించి దేవుడితో చెప్పడానికి ..." ఇవే మాటలు కావు. ఇలాంటి అర్థం వచ్చేట్టు ముద్దుగా అన్నానంట. మొన్న పిన్ని ఆ మాటలు తలుచుకుని పొట్ట చెక్కలయ్యేట్టుగా నవ్వింది.

ఆ తరవాత పిన్నిని అలా రాక్షసంగా కొట్టడం తను చూడలేదు కానీ... ఇంతకు పూర్వం తను పిన్ని పడుకున్న చోటే పడుకునేవాడు. ఇప్పుడు పడక మారింది. అమ్మ దగ్గర దేవుడి గదిలో పడుకుంటున్నాడు.

ఒక రోజు రాత్రి ఎందుకో మెలుకువ వచ్చింది. తడిమి చూశాడు. అమ్మ నిద్రపోతోంది. చుట్టూ చీకటిగా ఉంది. కళ్ళు విప్పినా మూసుకున్నా, దుప్పటి కప్పుకున్నట్టుగా ఉంది. చీకట్లోంచి బెక్కుకుంటూ, బెక్కుకుంటూ ఏడుపు వినిపించింది.

"రోజూ నన్నిలా ఎందుకు చిత్రహింస చేస్తారు. ఒక్కసారే చంపేయకూడదూ..."

"చంపుతానే... చంపుతాను... నిన్నిలా చంపను. వాతలు పెట్టి కండ కండ కోసి... చంపుతాను..." చిన్నాన్న కొడుతున్న శబ్దం. ఆ తరవాత తనకి చాలా సేపు నిద్ర పట్టలేదు. నిద్రపట్టనంతసేపూ పిన్ని ఏడుపు వినిపిస్తూనే ఉంది.

పిన్ని ఎందుకేడుస్తున్నదో అర్థమయ్యేది కాదు. చిన్నాన్న ఎందుకు కొడుతున్నాడో అర్థమయ్యేది కాదు. చిన్నాన్నను చూస్తే చచ్చేంత భయం వేసేది. తనను కూడా అలాగే కొడతాడేమోనని ఇంట్లోకి చిన్నాన్న రాగానే తలుపు చాటున దాక్కునేవాడు తను.

ఆరోజు తనకు బాగా జ్ఞాపకం ఉంది.

తొలిరోజు సాయంకాలం కొత్తాగ్రహారం వెంకటేశ్వరస్వామి కోవెలకి తీసుకెళ్ళింది పిన్ని. దారిలో రిక్షాలో కూచుని వూరంతా చూశాడు తను.

"చూశావా... అదే పెద్ద చెరువు... ఆ నీటిలో గేదెలెలా దిగిపోయాయో చూడు... ఆ పిల్లలు చూడు ఎలా ఈదుతున్నారో. బాగుంది కదూ..."

"అందులో చేపలుండవూ... కరిచెయ్యవూ."

"వాళ్ళని కరవ్వు. ముద్దుగా బొమ్మలా ఉన్నావని... నిన్నే కరుస్తాయి..." అప్పుడే వచ్చి కరిచేస్తాయేమో నని పెద్ద కళ్ళు చేసుకుని చూశాడు తను.

"అదిగో పెద్ద స్తంభం... చూడు ఎంత బాగుందో...ఎక్కుదామా.."

"నన్నెక్కించవా. పి...న్నీ... ఇప్పుడే ఎక్కుదాం..."

"ఇప్పుడొద్దులే. ఆ తరవాత..." వెనక్కి తిరిగి రిక్షా గుడ్డ తప్పించి పెద్ద రాక్షసుడిలా నిలబడ్డ ఆ గంట స్తంభాన్ని కళ్ళప్పగించి చాలా సేపు చూశాడు తను.

వెంకటేశ్వరస్వామి కోవెల ఎంతో బాగుంది.

పిన్ని గంట కొట్టి దేవుడికి దండం పెట్టుకుంటోంది.

"నేను గంట కొడతా..." పిన్నిని దండం పెట్టుకోనివ్వకుండా తను మారాం చేశాడు.

"ఎదురుగా ... ఎగిరితే అందుతుంది..." నవ్వుతూంది పిన్ని.

"పొట్టి బుడంకాయ్... కొట్టరా గంట." పిన్ని ఎత్తుకుంటే గంటను గబగబా కొట్టాడు తను. ఇక చాల్లే అన్నంత వరకూ కొట్టాడు. అదయ్యాక కొంత సేపు కోవెల్లో కూర్చుని వచ్చేశారు.

ఆ రాత్రి పిన్ని దగ్గరే పడుకో బెట్టుకుంది తనని. సగం రాత్రి వరకూ తను పడుకోలేదు. ఏవేవో కథలు చెప్పింది. చెప్పిన కథలు చెప్పకుండా ఎన్నో కథలు చెప్పింది. రాజూ రాణి కథలు... పిల్లీ ఎలకా కథలు... రాజూ - ఏడుగురు కొడుకుల కథలూ... అబ్బో పిన్ని కెన్ని కథలొచ్చో.... కథలన్నీ చెప్పడం అయిపోయాక తనని జోకొడుతూ పాట పాడింది. ఆ పాట నిన్న మొన్న పాడినట్లే అనుక్షణం జ్ఞాపకం వస్తుంటుంది. అప్పట్లో పిన్ని పాడిన ఆ పాట ఎంతో హాయిగా అనిపించింది... రానురానూ వయసొచ్చి, పెరిగాక పిన్ని బతుక్కీ ఆ పాటకూ ఎంతో దగ్గర సంబంధం ఉందేమో అనిపిస్తుంటుంది.

"బోయ తెచ్చిన పిలక సిట్టి తంఢ్రీ
రెక్క లిప్పి పిలక సిట్టితంఢ్రీ
గిజగిజా లాడింది సిట్టి తంఢ్రీ
దయలేని వాడమ్మ సిట్టి తంఢ్రీ
మనసు లేనోడమ్మ సిట్టి తంఢ్రీ
పట్నమే సేరేనె సిట్టితంఢ్రీ
సిట్టి సిలకని కసాయి కమ్మేసె సిట్టితంఢ్రీ
పాపివాడమ్మా... బతికెనా సిట్టితంఢ్రీ
సిల కుసురు తగిలింది సిట్టితంఢ్రీ
కొండపామే కుట్టింది సిట్టితంఢ్రీ...."

ఆ పాట తన కెంతో ఇష్టం. కొండ పాము కుట్టి బోయవాడు పడిపోయాడు అనగానే- తను చప్పట్లు కొట్టేవాడు. తన మీద ఒక కాలువేసి తనని గుండె కదుముకొని గట్టిగా విడవకుండా పడుకునేది పిన్ని.

ఆ రోజూ అలాగే పడుకోబెట్టుకుంది. పిన్నిని కావలించుకుని పడుకున్నాడు తను.

తను ఉదయం లేచేసరికి ఏడుపులు. మళ్ళీ చిన్నాన్న పిన్నిని కొట్టాడేమో. భయంగా కదల్లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. లేచి తూగుటుయ్యాల దగ్గర కొచ్చాడు తను.

చిన్నాన్న ఇంటి మధ్యలో మంచమ్మీద కూర్చున్నాడు. అమ్మ కింద కూర్చుంది. పిన్ని కనబడలేదు. పిన్ని ఏమైంది? చిన్నాన్న ఏడుస్తున్నాడు. ఎప్పుడూ ఎర్రగా కళ్ళు పెట్టి ఎవరినో ఒకర్ని ఏదో ఒకటి అని ఏడిపిస్తేనే కాని వూరుకోని రాక్షసుడు చిన్నాన్న ఏడుస్తున్నాడు!

"వూరుకో కృష్ణా. వూరుకో... అదిలాటిపని చేస్తుందని ఎవరనుకున్నాం. వేగిరం వెళ్ళి బొండపల్లి... కనిమెరక... కబురు చెయ్యి. లేకపోతే వాడింటి కెళ్ళి వాకబు చెయ్యి."

ఆ వయసులో తనకు పిన్ని ఎక్కడికో వెళ్ళిపోయిందని బోధపడింది తప్ప మరేవీ అర్థం కాలేదు. ఎందు కెళ్ళిపోయిందో వూహించలేకపోయాడు. చిన్నాన్న కొడుతున్నాడని కోపమొచ్చి వెళ్ళిపోయుంటుంది. అమ్మ కోపమొచ్చి కొడితే, కనిపించకుండా ఆ రోజంతా అయోధ్యా మైదానంలో తను ఉండిపోలేదూ.. అందరూ తలో దారి వెళ్ళి వెతికితే, అప్పుడు ఎవరికీ కనిపించకుండా ఇంటికి రావడం, బెంగటిల్లి పోయిన అమ్మ ఎత్తుకుని అక్కున చేర్చుకుని "నిన్నెప్పుడూ ఏవనన్లేరా" అని బుజ్జగించడం అదో సరదా.

కానీ పిన్ని అలా చెయ్యలేదు.

చిన్నాన్న వూరూర్లు వెళ్ళి వెతికాడు. కబుర్లు పంపాడు. ఉత్తరాలు రాశాడు. పిచ్చివాడిలా తిరిగాడు. ఎక్కడా పిన్ని కనబడలేదు. "ముందెందుకు కొట్టాలి. అంతే కావాలి. చిన్నాన్న కూర్చొని ఏడుస్తుంటే గొప్ప సరదాగా ఉండేది నాకు.

కానీ పిన్ని గుర్తుకొచ్చేసరికి మాత్రం మనసంతా బెంగగా తయారయ్యేది. కానీ, ఆ రోజు చిన్నాన్న బొండపల్లి వెళ్ళొచ్చి సావిట్లో కూర్చున్నాడు. ఇంట్లో చుట్టాలందరూ ఉన్నారు. తాతయ్య మామయ్య, అత్తయ్య, మామ్మ... పెద్ద బావాజీ అందరూ చిన్నాన్నని ఓదార్చడానికి వచ్చారు.

అందరూ పెద్దరుగు మీదా, మెట్లమీదా కూర్చున్నారు. అమ్మ తలుపు రెక్క పట్టుకుని గుమ్మం దగ్గర నిలబడింది. అమ్మ చీర చెరగులు పట్టుకుని నిల్చున్నాడు తను.

"సుభ... చచ్చిపోయింది. బొండపల్లి బావిలో నిన్న శవం తేలిందట. సుభద్రదేనని సీతాపతి మావయ్యా వాళ్ళు గుర్తు పట్టారుట" ఆ విషయం చెప్పాడు చిన్నాన్న.

ఒక్కసారి ఆడ మళయాళం గొల్లుమంది.

"కసుగాయప్పుడే ఎంత కష్టమొచ్చిందిరా.

"కృష్ణా... ఆడ దిక్కులేని బ్రతుకైపోయింది..." ఓదార్పులు, సానుభూతులు.

పిన్ని చచ్చిపోయిందని తెలియగానే ఏమిటో బోధపడలేదు. చిన్నాన్నతో కలిసి అందరూ ఏడుస్తున్నారు. అందుకని పెద్ద నోరుపెట్టి తనూ ఏడ్చేసాట్ట.

అది నా చిన్నప్పుడు జరిగిన విషయం.

పెరుగుతున్నకొద్దీ నాకు చాలా విషయాలు అర్థమయ్యాయి. సుభద్ర పిన్ని మా అమ్మ సొంత చెల్లెలు కాదట. చిన్నాన్న కూతురట. చిన్నాన్న మరి పెళ్ళి చేసుకోలేదు. వ్యవసాయంలోనే స్థిరపడి కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. చిన్నాన్న దగ్గరి నుంచి మేం మా వూరొచ్చేశాం.

అప్పుడప్పుడు పిన్ని జ్ఞాపకం వస్తుంటుంది. పిన్ని నవ్వు. అలాంటి నవ్వు అప్పటి నుంచీ ఇప్పటి వరకూ మరెవ్వరిలోనూ చూడలేదు. అప్పుడప్పుడు పిన్ని కలలోకొచ్చి పలకరించి, ప్రక్కన కూర్చుని కబుర్లాడి వెళ్ళి పోయినట్టు కల వచ్చేది.

"పిన్ని కలలో కనబడిందే అమ్మా..." అంటే అమ్మ కసురుకునేది.

"పెళ్ళయి కాపురం చేస్తూ పరాయి వాడితో సంబంధం పెట్టుకుని చాటుగా తిరిగి, బైట పడిందని నూతిలో పడి,అప్రతిష్ట తెచ్చిందిరా... పిన్ని పిన్నీ కాదు, ఏవీ కాదు. సిగ్గుచేటు..." అనేది అమ్మ.

ఇప్పుడు నాకు పాతికేళ్ళు.

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం ఉంది. నేను బజారులోకి వెళ్ళి మామూలుగా ఇంటికొచ్చాను. అమ్మ సావిట్లో స్తంభానికి చేరబడి కూర్చుని ఉంది. అమ్మ ఎదురుగా తలుపు మీద నీలం పువ్వుల చీర కట్టుకుని వెనక్కి తిరిగి కూర్చొని మాట్లాడుతోంది ఆ వ్యక్తి.

"బాబొచ్చాడు" అని లేచి "ఎవరో చెప్పుకోవోయ్" అంది అమ్మ.

ఎవరు? తలెత్తి చూశాన్నేను. పోల్చుకోలేక పోయాను. కళ్ళద్దాల్లోంచి కళ్ళను చూడ్డానికి ప్రయత్నం చేశాను. కోల ముఖం, ఎత్తుగా ఉంగరాల జుత్తు, చూపుడు వేలంత ముక్కు. ఆ చివర మంచి ముత్యం లేదు. నేను వూరుకోకుండా గుక్కపెట్టి చిన్నప్పుడు ఏడుస్తుంటే, చీమిడి కార్చుకుంటుంటే తన చేతులతో తీసి "నా కొడుకు.. వీడే నా కొడుకు. నాకు మరి పిల్లలక్కరలేదని" గుండెలకత్తుకొని నన్నాడించి, జోల పాటలు పాడి, రాజూరాణీల కథలు చెప్పి, అమృతం లాంటి అప్యాయతతో అమ్మలా సాకిమాయమైపోయిన పిన్ని!"

సుభద్రపిన్ని!

"బాబూ... బాగున్నావా. చిన్నప్పుడు మన పెరట్లో తులసి మొక్కంత ఉండేవాడివి. ఎంత ఎదిగిపోయావు... అచ్చు మీ నాన్న పోలికే... కదక్కా..." అమ్మ వైపు తిరిగి అంది పిన్ని.

"వెదురు కర్రలా పెరిగాడు. నా చిట్టి కొండ.... అంతే తప్ప ఆ ఐదేళ్ళప్పటి బూరి బుగ్గలేవీ... మాటి మాటికి చెయ్యి పెట్టి పైకి తోసుకునే పట్టులాంటి జుట్టేదీ. అప్పుడు వీడికి నేనేకదక్కా మన మంగలి అప్పలస్వామిచేత దగ్గరుండి జుట్టు కత్తిరించేదాన్ని... ఏమిటా జుత్తు... మీ తమ్ముడూ అలాగే పెంచుకున్నాడిప్పుడు... అదేదో హిప్పీయో... స్టైప్పోటా..." పిన్ని నవ్వింది.

అదిగో అదే నవ్వు. మళ్ళీ పదిహేను సంవత్సరాల తర్వాత స్వచ్ఛమైన నవ్వు. పాలవెల్లిలాంటి నవ్వు. మాయామర్మంలేని మీగడ తరకలాంటి నవ్వు. మరి పిన్ని చచ్చిపోయిందన్నాడు చిన్నాన్న?!

భోజనాలన్నీ అయిపోయాయి.

పెరట్లో మంచాలు వేసుకున్నాం. బాదం చెట్టు నుంచి పక్షుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. చంద్రుడు తెల్లటి కాగితాన్ని కత్తిరించి నల్లటి అట్టమీద అంటించినట్లుగా కొడవలిలాగా ఉన్నాడు.

సన్నగా గాలి ఉండుండి వీస్తోంది. లోన కొంచెంసేపు అమ్మతో మాట్లాడి "నేను నా కొడుకు దగ్గర కూచుంటానని" వచ్చి నా మంచం మీద కూచుంది పిన్ని.

వంగి నా జుత్తులోకి వేళ్ళు జొనిపి నా తలని తన ఒళ్ళో పెట్టుకుని నా నుదుటన ముద్దు పెట్టుకుంది.

"నేను చచ్చిపోయానని అనుకున్నావు కదూ బుజ్జీ..."

ఏం చెబుతాను. అవునన్నట్లుగా తలూపాను. మేఘం తప్పుకున్నప్పుడల్లా పిన్ని ముఖం మీదా వెన్నెల కాంతి పడి తెల్లగా మెరుస్తోంది.

నేను మాట్లాడకుండా తిన్నగా ఆకాశంవైపూ, బిక్కుబిక్కుమంటూ కర్ఫ్యూ సమయాల్లో మనుషులు తిరిగినట్టుగా ఒకటీ అరా వంగి చూస్తున్న చుక్కలవైపూ చూస్తున్నాను.

"ఏవిరా బాబూ... పిన్ని ఒళ్ళో పడుకోవడం సిగ్గుగా ఉందా..." అని అడిగింది పిన్ని. నిజమే. చిన్నప్పుడెప్పుడో స్నానం చేయించి బట్టలు తొడిగి, బొట్టూ కాటుకా పెట్టి, తన పక్కలో పడుకోబెట్టుకున్నప్పుడు, పిన్ని గుండెల మీదెక్కి, గుండెల మీద బాది పిన్ని మెళ్ళో బంగారు గొలుసును నోటితో పట్టుకుని, చేత్తో గలగలలాడించి అల్లరి చేసిన రోజులు కించిత్తు జ్ఞాపకం ఉన్నా, అవన్నీ వూహ తెలియని రోజులు. పిన్ని అయినా కొత్త వ్యక్తిలా ఉంది.

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు పిన్నీ... ఏమైపోయావు.. నూతిలో పడి చనిపోయావన్నాడు చిన్నాన్న..." పిన్ని చేతులను గుండెలమీద వేసుకుంటూ అడిగేను.

"అవును రామూ చచ్చిపోయాను. మీ చిన్నాన్న దృష్టిలో చచ్చిపోయాను. అయినవాళ్ళ అందరి దృష్టిలోనుంచి వెళ్ళిపోయాను. వీళ్ళమధ్య బ్రతకలేక, వీళ్ళ చిత్రహింసలు భరించ లేక, వీళ్ళందరికీ అందకుండా దూరంగా... సుదూరంగా... వెళ్ళిపోయాను... వెళ్ళిపోయి ఏకాకిగా ...ఎవరికీ ఏమీ కాకుండా, నా అనుకునే వాళ్ళందరూ చచ్చిపోయారనుకుని... చస్తూ బ్రతికాను... తెలుసా.."

పిన్ని చెబుతున్నప్పుడు దుఃఖం పొంగి, గొంతు బొంగురు పోయి, సన్నగా జీరగా మారింది. వెన్నెల్లో పిన్ని అంతంత కళ్ళు కన్నీటితో తళుక్కున మెరిసి వరదలా ఉప్పొంగి, నా ముఖంమీద కన్నీటి చుక్కలు రాలాయి.

"అప్పటికి నువ్వు బాగా చిన్నవాడివి బాబూ... నీకు జ్ఞాపకం ఉండొచ్చు, లేకపోవచ్చు. మీ చిన్నాన్న గొడ్డును బాదినట్టుగా బాదేవారు తెలుసా... ఎందుకనుకున్నావు?" నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అంది పిన్ని.

నేను జవాబు చెప్పలేకపోయాను. ఆ దృశ్యాన్ని నేను మరిచిపోలేను.పిన్నిని మరవలేనంత కాలం ఆ ధ్వంస దృశ్యాన్ని నేను మరువలేను.

"నేను మీ చిన్నాన్న ఇంట కాలు పెట్టేప్పుడు ఎన్ని ఆశలతో వచ్చానో తెలుసా. అంతకు పూర్వం పల్లెటూర్లో ఘోషాల మధ్య ఎక్కడికీ వెళ్ళాలన్నా వెళ్ళలేక, చూడాలన్నా ఏదీ చూడలేక చీకటి గుహలో బ్రతికాను. నాకెన్నో చూడాలని ఉండేది. పట్నం సిన్మాలు... షికార్లు... పార్కులు... బజార్లు అన్నీ ఉన్నాయి. పట్నంలో కాపురం ఎంతో స్వేచ్ఛగా గడపొచ్చనుకున్నాను. కానీ వచ్చిన వారం రోజుల్నాడే తెలిసింది. మీ చిన్నాన్నకన్నీ పాతకాలపు పద్ధతులు. పగలంతా అందరితో నవ్వుతూ తిరిగినా రాత్రిళ్ళు ఎంత పోరు భరించేదాన్నో తెలుసా.. మీ చిన్నాన్న ఎన్నెన్నో ఆంక్షలు పెట్టేవారు. పెద్దగది దాటి బయటకు రాకూడదనేవారు. ఎవరైనా తనకోసం వస్తే పని మనిషిచేత కబురు పంపు కానీ నువ్వెళ్ళి ఏ భోగట్టా చెప్పకు అనేవారు... అలాగే... పోనీ.. సిన్మాలూ, షికార్లూ... మనసులో ఎన్ని కోరికలు తలెత్తినా అన్నిటినీ ఆయన బుద్ధిని చూసి అణుచుకుని, నాలో నేను కుమిలేదాన్ని... ఐనా ఎదిరింటికీ, పొరుగింటికీ వెళ్ళవద్దని, వెళితే మంచిమాట కాదని బెదిరించేవారు. వెళ్ళడం కూడా మానేశాను.

కానీ -

ఆ రోజు మన వీధిలో ఆ చివర మీ చిన్నాన్న స్నేహితునికి కొడుకు పుడితే బారసాలకు ఆయన వెళ్ళమంటేనే వెళ్ళాను. అక్కడ అందరితోపాటూ నేనూ

కూర్చున్నాను. మీ చిన్నాన్న స్నేహితుని భార్య పరమేశ్వరి, వాళ్ళ తమ్ముడు వున్నారు. ఇంకా చుట్టుపక్కలవాళ్ళు, ఏదో విషయం వస్తే అందరూ ఒక్కసారే నవ్వారు నాకూ నవ్వొచ్చింది. సరిగ్గా అలాంటి సమయంలోనే మీ చిన్నాన్నొచ్చారు. అక్కడ బాగానే ఉన్నారు. ఇంటికి రాగానే మొదలు. "వాడెవడు... వాడివైపు చూసి ఎందుకలా ఇకయికలూ... పకపకలూ..'' అని.

నేనేం చెబుతాను! అంతా ఆయనే వూహించుకుంటున్నారని, అనుమానం తప్పు అందులో నిజం లేదని ఎలా చెప్పాలి.?

"నువ్వేమీ బదులివ్వకపోతే వాడు - ఆ పరమేశ్వరి తమ్ముడు రెండుసార్లు ఇలా ఎందుకు తిరుగుతాడు. మీ ఇద్దరి మధ్య ఏదో ఉంది. చెబుతావా చెప్పవా?'' అన్నారు. ఆయన కిదే అనుమానం.

ఒక ముద్దూ లేదు, ముచ్చటా లేదు. నీ చిన్నప్పుడు పగలంతా నీతో ఎంత హాయిగా గడిపేదాన్నో, రాత్రి అంత నరకం అనుభవించేదాన్ని. కోపం వస్తే మీ అందరి ఎదుటా కొట్టేవారు. లేకపోతే రాత్రంతా గిల్లో గిచ్చో, తొడపాశాలు పెట్టో, బయటికి ఏడిస్తే తల గోడ కేసి కొట్టో చేసేవారు. అలాంటి బతుక్కన్నా చావడం మేలనిపించేది.

మనిషి ఆకారాన్ని చూసి ఇంత మంచివాడు భర్తగా దొరికినందుకు ఎంత సంతోషించానో అంత రాక్షసుణ్ణి కట్టుకున్నందుకు రాత్రంతా రక్తానికిరక్తం ఏడిచేదాన్ని తెలుసా.

ఆ పరమేశ్వరి తమ్ముడు సుబ్బారావు ఒకటి రెండు సార్లు సైకిలు మీద అటూ ఇటూ మన ఇంటి ముందు నించి తిరిగేవాడు. ఈయన మంచివారు కారని వాడ్ని చూసి వెంటనే లోని కొచ్చేసేదాన్ని. ఎక్కణ్ణుంచి చూసేవారో లేకపోతే ఎవరైనా చెప్పేవారేమో రాత్రయేసరికి మళ్ళీ మొదలు.

నేను లేనప్పుడు ఏమేం జరుగుతున్నాయి. మీ ఇద్దరూ ఎక్కడ కలుస్తున్నా' రని 'మూడు కోవెళ్ళకి పురాణం పేరున వెళ్ళి ఇదా నువ్వు చేస్తున్న పనని' చావబాదేవారు. ఆ సుబ్బారావుగాడు, వాణ్ణి తలెత్తి ఒకసారి చూసిన పాపాన పోలేదు. నేనంటే వాడికి ఇష్టం ఉందేమో, నేను చూస్తానని నన్నాకర్షించడానికి తిరిగేవాడేమో... కానీ నాకు సంబంధం లేని విషయం నన్ను ముక్కలు ముక్కలుగా కోసినా నే నెలా ఒప్పుకునేది?

ఆ రోజు నా కింకా జ్ఞాపకం ఉంది. నువ్వు లేవగానే ద్వారబంధం పట్టుకుని చూస్తున్నావు. మీ చిన్నాన్న ఎక్కణ్ణుంచో ఉత్తరాలు పట్టుకునొచ్చి

"ఈ ఉత్తరాలు వాడు నీకు రాసినవేనా.. నీ బొట్టు పెట్టెలో దొరికాయ"ని సరుగుడు కర్రతో ఎలా కొట్టారో, ఆ బాధలన్నీ ఎలా భరించానో... ఇప్పుడు తలుచుకుంటుంటే ఎంత ఒళ్ళు జలదరిస్తుందో తెలుసా... అప్పుడప్పుడు చచ్చిపోవాలనిపించేది. మీ చిన్నాన్నని తప్పిస్తే అందరూ మంచివారే. మీ అమ్మ, ముఖ్యంగా నువ్వూ. మీగడతో చేసిన బొమ్మలా ఉండేవాడివి. నిన్నేలా వదులుకోను. మా సంసారం ఇలా ఉంటే నాకు పిల్లలెలా పుడతారు. అందుచేత నువ్వే నా కొడుకువని అందరితో అనేదాన్ని... అప్పట్లో మీ అమ్మని అడిగినట్టు జ్ఞాపకం నిన్ను నా కిచ్చీమని..."

కథ చెప్పడం ఆపి - "పడుకున్నావా రామూ..." అంది. నేను మెలుకువగానే ఉన్నాను. నిద్ర రావడంలేదు. చిన్నప్పుడు అర్థమవని విషయాలన్నీ ఒక్కొక్కటి పువ్వుల్లా విడుతున్నాయి. రాక్షసత్వం, మగవాడిలో ఎలా ఉంటుందో అర్థమౌతోంది.

గాలిపటంలా వూగుతున్నాడు చంద్రుడు... మంచులా కురుస్తూంది వెన్నెల.

"పడుకోలేదు చెప్పు..." అన్నాను.

పిన్ని చెప్పడం ప్రారంభించింది.

"ఆ ఉత్తరాలేవిటో.. వాటి సంగతేవిటో నాకు తెలీదు. ఆ రోజు రాత్రి మాత్రం ఎంత నరకం అనుభవించానో తెలుసా. మామూలుగా నిన్ను నా పక్కలోనే పఢుకో పెట్టుకుంటే... మీ చిన్నాన్న నిన్ను నా పక్కలోంచి తీసేసి మీ అమ్మ కిచ్చేశారు. మూలన ఒదిగి పడుకున్న నన్ను లేపి "ఇప్పుడైనా చెబుతావా లేదా".. అని దబీదబీ మని బాది "ఆ ఉత్తరాలు ఎవ్రరాశారో చెప్పు" అని అడిగారు. నేను చెప్పేది ఒకే జవాబు "నాకు తెలీదు." ఆ తరవాత ఆయనేం చేశారో తెలుసా... ఆపి నా వేపు చూసి "నే నెన్ని బాధలు పడ్డానో నీకు తెలియాలి. కొడుకువి నీతో చెప్పుకున్నా ఫరవాలేదు. నన్ను బట్టలిప్పించేసి... ఎక్కణ్ణుంచి పట్టుకొచ్చారో. నా మక్క మీద ఎన్ని వాతలు పెట్టారో తెలుసా... నా ఎర్రటి శరీరమ్మీద అవి ఇప్పటికీ ఆయన అనుమానానికి నిదర్శనంగా ఆ అమానుషపు గుర్తులలాగే ఉన్నాయి.

"నే నేడుస్తానని అరుస్తానని ఆయన ఆ రోజేం చేశారో తెలుసా, నా నోట్లో గుడ్డలు కుక్కేసి మరీ ఆ పని చేశారు."

"నే నందంగా ఉండడం నా తప్పా చెప్పు బాబూ. నా పక్కన ఆయన నిలబడితే కాకి ముక్కుకి దొండపండని అంటే దానికి నేనా కారణం. దానికి

నన్నొ చావగొట్టడం. నేను సావిట్లో నిలబడితే దారిన పోయేవాళ్ళు చూస్తారని... ఎన్నాళ్ళని ఇంట్లో కుక్కి మంచంలా పడుండడం? నేనేం ప్రాణం లేని రాయినా.. ఆయనకి ఎలాగోలా తృప్తి కలిగిద్దామనుకున్నాను. బయటకు రావడంకూడా మానేశాను. ఆర్నెల్లు వీధి ముఖం ఎరగను. అప్పుడు కూడా ఆయనకు నమ్మకం లేదు...

అప్పటికీ "నన్ను పుట్టింటికి పంపించెయ్యండి, నేనీ బాధ పడలేను" అన్నాను. కానీ పుట్టింటికి పంపించేస్తే పరువు తక్కువ. దానికి తక్కువ రాకూడదు కదా మీ మగవాళ్ళకి.

ఆ తరవాత తెలిసిపోయింది మీ చిన్నాన్న అసలు ఉద్దేశ్యం. మగవాడిలో ఎంత స్వార్థం కనబడకుండా దాక్కుంటుందో తొలిసారిగా తెలుసుకున్నాన్నేను. తన సుఖం కోసం ఆడదాన్నెలా ఉపయోగించుకుని అవతల ఉదయాన్నే పెంట మీద పారేసిన చెత్తలా ఎలా పారేస్తాడో అంతా తొలిసారిగా నా కర్థమయింది. బాబూ జీవితం అంటే తెలిసొచ్చింది. తరతరాల్నించి మగవాడు ఆడదాన్ని బానిసలా ఎందుకు ఉంచుకుంటున్నాడో, స్వేచ్ఛ నివ్వకుండా ఎలా అణగ దొక్కుతున్నాడో, నా లాంటి వారు ఎదురు తిరిగితే ఎలా అణగ తొక్కేస్తారో అన్నీ మొదటి సారిగా తెలిసొచ్చాయి బాబూ.

మా అమ్మ చిన్నప్పుడే పోయింది. ఆవిడకి బోలెడన్ని నగలుండేవి. కంటెలు, కాసుల పేర్లు, జిగినీ గొలుసులు, పది పేటల చంద్రహారాలు, నాగరాల జత. అవ్వన్నీ నావే. రాజాంలో పూసపాటి వారి పెద్ద భవంతి మాదే. నాన్న చచ్చిపోతూ అది నాకే రాసేశాడు. పెద్ద మామిడి తోటలు రెండు, పల్లం పాతికెకరాలు ఉంది. అదంతా నా పేరనే ఉంది. అందులో కొంత మీ చిన్నాన్నకి రాస్తానని మాటిచ్చారు పెళ్ళిలో మా నాన్నగారు. రాయలేదు. మొత్తం అంతా నన్ను రాసిచ్చీమని. ఎంత చిన్న విషయానికి నా కాపరాన్ని చెడగొట్టారో చూడు. ఎంత స్వార్థమో!

ఇంత ఆస్థి నా పేరున ఉండగా... అదంతా ఆ పురుషుడి పేరున రాసిస్తేనే కాని ఆయనకు సంతృప్తి లేదు. చూడు, మగవాడి అహంకారం చూడు. ఆడదాని అమాయకత్వం కాకపోతే...

ఆయన చెప్పినట్లు నేను చెయ్యలేదని ఎన్ని బాధలు పెట్టారో చూడు... ఒక వేళ ఆస్థంతా ఆయన పేర్న రాసేస్తే "నువ్వాడికి కన్ను కొట్టావు, వీడి వేపు చూసి నవ్వావు, వాడికి ఉత్తరాలు రాశావు, వీడికి ఉత్తరాలు రాశావని" బయటకు తగిలేస్తే నా పని అడుక్కోవడమే.

అందుచేతే ఇక్కడ కన్నా ... ఇంకెక్కడైనా మనశ్శాంతితో హాయిగా బతకొచ్చని ఇల్లొదిలి వెళ్ళిపోయాను. అందరినీ వదలి... ఎన్ని కష్టాలు పడ్డాననుకున్నావు."

నన్ను పట్టుకుని పిన్ని ఏడుస్తూనే ఉంది. ఏడుస్తూ కథ చెబుతూనే ఉంది.

"నువ్వు చచ్చిపోయావని చెప్పాడు చిన్నాన్న."

"మీ చిన్నాన్న ఉద్దేశ్యం ...నేను... ఆ సుబ్బారావుతో వెళ్ళిపోయానని. అలాగ చెప్పుకోలేక ఇలాగ చెప్పారు. అంతేకానీ తన కుళ్ళు బయట పెట్టుకోరుగదా. దేవుడు లాంటి భర్తను వదిలి ఎలా పోయిదమ్మా అంటే ఆయనకు తృప్తి. సంఘానికి కళ్ళుంటేనే గదా... వినదు, చూడదు.. ఇష్టమొచ్చినట్టుగా వాగుతుంది. తన తప్పుల్నీ, చెడునీ ఏ మగాడూ బయట పెట్టుకోడుకదా. అందరూ పైకి మగరాజులే. లోనే స్వార్థం... కుళ్ళు... కంపు... దగా... వంచన... మోసం. ఇవన్నీ ఆడదానిముందే మరెక్కడా చేతకాదు. మరెక్కడా మనిషి కారు. చిల్లికానీకి చెల్లరు..."

పిన్ని ఆవేశంగా చెప్పుకుంటూ వెళ్ళిపోతోంది.

"అసలు మీ చిన్నాన్నకు తెలుసు, నేను ఆయన బాధ పడలేకే ఇల్లొదిలి పోయానని... సుబ్బారావు గాడితో లేచిపోలేదని ఆయనకీ తెలుసు."

"ఎలాగ'? ఆశ్చర్యంగా అడిగాను నేను.

"ఆ ఉత్తరాలు సుబ్బారావు రాసినట్టుగా ఆయన రాసినవే."

నేను మరీ ఆశ్చర్యపోయాను.

"కోతి పిల్లని తెచ్చి రోడ్డు మీద అడుక్కునే వాడు ఎలా ఎన్ని ఆటలు నేర్పి ఆడిస్తాడో వీలైతే మగవాడు కూడా ఆడదాన్నలా అన్ని ఆటలు ఆడిస్తాడు. అదే నిజమైన ప్రేమనుకుని పొంగిపోతుంది పిచ్చి ఆడది.

తరవాత ఎన్ని కష్టాలు పడ్డానో తెలుసా, బాబూ! ఒంటరి ఆడది ప్రపంచంలో ఎలా వంచించ బడుతుందో, నవలల్లో చదివిందంతా ప్రత్యక్షంగానే చూశాను. అనుభవించాను. ఉన్న గాజులూ, నెక్లెసూ, తెచ్చుకున్న డబ్బూ - అన్నీ ఒక్కొక్కటి అయిపోయాయి. తిండి తిండానిక్కూడా మూడు రోజులు నోచుకోలేదు. అంట్లు తోముకుని కొన్నాళ్ళు బతికాను. అనాథాశ్రమంలో బతికాను. అలాటి దౌర్భాగ్యమైన బతుకు బతుకుతున్నందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. ఏదో తెలీని ఆవేశం - చచ్చిపోవాలని ... మెరీనా బీచ్‌లో కూర్చున్నాను. నాకు ఒకే ఒక్క స్నేహితురాలు నా ట్రంకు పెట్టె.

దూరంగా కెరటాల చేతులు చాస్తూ సముద్రం.

చచ్చిపోదామనుకున్నాను. ఇంత దూరం వచ్చింది పిరికిగా చచ్చిపోవడానికా? ఏడవడానికి కన్నీళ్ళు కూడా కనుకొలకుల ఎడారుల్లో ఇంకిపోయాయి.

ఎవరో ఒకతను నా పరిస్థితి చూసి జాలి పడ్డాడు. తనతో తీసుకెళ్ళాడు. సినిమాల్లో ఎగ్‌స్ట్రా వేషాలు ఇప్పించాడు. సహాయం పేరున ఆడదాని గుండెల్లోకి ప్రవేశించి, కొండ చిలువలా చుట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తాడు మగవాడు.

ఆ ఎగ్‌స్ట్రా బ్రోకరు గాడి చేతి నుంచి తప్పించుకునేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. అప్పుడే కలిశారు మోహన్రావు. ఆయనకీ సిన్మాల్లోనే పని. సంగతంతా విని జాలి పడి, కొన్నాళ్ళు ఆయనతో ఉండనిచ్చి ఆ తరవాత నన్ను పెళ్ళి చేసుకున్నారు. డబ్బుండీ మీ చిన్నాన్న దగ్గర ఎన్ని బాధలు పడ్డానో డబ్బు లేక ఒక్కొక్కప్పుడు పస్తులుండి ఒక రొట్టెని చెరో అరా చేసుకుని టీ తాగి ఇద్దరం గడిపాం. ప్రేమంటే ఏమిటో, హాయంటే ఏమిటో మోహన్రావు మంచి మనసులోనే నాకు తెలిసింది.

నేను మద్రాసులో ఉన్నానని ఎలా తెలిసిందో, నాన్న పోయి రెన్నెళ్ళయిందట. ఎవరో ఉత్తరం రాశారు ఆస్తి విషయాలు చూసుకోమని... ఈ వూరొచ్చాను... నిన్ను చూస్తానని కానీ, నీతో మాట్లాడగలనని కానీ అనుకోలేదు. నువ్వు కనబడ్డంతో నాకెంత ఆనందం వేసిందో తెలుసా!''

పిన్ని చెప్పడం ఆపి, రెండు చేతులూ నా చుట్టూ వేసి నా గుండె మీద తన తల పెట్టుకుని చిన్న పిల్లాడిలా నన్ను కావలించుకుంది.

పిన్ని కార్చిన ప్రతి కన్నీటి చుక్కా మగవాడి దౌష్ట్యానికి ఎదురు సవాల్ చేసి నిలబడింది. పిన్ని తిన్న ప్రతిదెబ్బా మగవాడి అహంకారానికి విలువ కట్టింది. తరతరాల నుంచీ మగవాడి ఉచ్చుల నుండి, పడుతున్న బాధలనుంచి, బానిసత్వం నుంచి, సంకెళ్ళు తెంపుకుని విడివచ్చి స్వేచ్ఛకై పోరాడి విజయం సాధించిన పిన్ని, ఆ సమయంలో నాకు మామూలు స్త్రీలా కనబడలేదు. పిన్నిలో ఎంతో తేజస్సు కనబడింది.

వారం రోజులున్నాక, వ్యవహారాలన్నీ పూర్తిచేసుకుని మద్రాసు వెళ్ళిపోవడానికి నిర్ణయించుకుంది పిన్ని.

స్టేషన్లో ఇంకా రైలు రాలేదు.

సూటుకేసు క్రిందపెట్టి దాని మీద తను కూర్చుంది. ప్రక్కన క్రింద నేను కూర్చున్నాను.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్ పిన్నీ...?"

పిన్ని నా రెండు చేతులూ పట్టుకుని నిమిరింది.

"వస్తాను... నీ పెళ్ళికొస్తాను. .. అప్పుడు మోహన్రావు, నేను, నీ తమ్ముడూ, చెల్లెలు అందరం వస్తాం..."

ఐదు నిముషాల్లో రైలు వస్తున్నట్లుగా ప్రకటన చేశారు

- పిన్ని లేచి నిలబడింది.

పిన్ని వెళ్ళిపోతుంటే ఏదో బెంగగా ఉంది. మనసంతా ఖాళీ సీసాలా అయిపోయింది.

"బాగున్నావా సుభా.." పిన్ని నుద్దేశించి ఆ మాట వినబడేసరికి తల తిప్పి చూసాను.

చిన్నాన్న!

పిన్ని ముఖం వైపు చూశాను. పిన్ని కళ్ళు ఆ సమయంలో లేతాకు మీద పడ్డ మంచు బిందువుల్లా మెరవడం చూసాను. ఏం మాట్లాడాలో తోచక కాబోలు పిన్ని పైటకొంగును మునిపంట పట్టి ఆత్రుతనో, ఆనందాన్నో, ఆవేశాన్నో,అనుభూతినో దాచుకోవటానికి ప్రయత్నం చేస్తోంది.

"నువ్విలా కనబడతావని అనుకోలేదు సుభా.." ఆ మాటల్ని మెత్తగా అన్నాడు చిన్నాన్న. పూర్వం కన్నా సన్నబడ్డాడు. జుత్తు నెరిసింది.

"చచ్చిపోయిన వాళ్ళు కనబడుతారని ఎవరూ అనుకోరు కదా..." పిన్ని గొంతు వణికింది. లైటు కాంతి పిన్ని కోల కళ్ళ మీద పడి బెంగగా కదిలింది. పైట చెంగుతో కళ్ళొత్తుకుని చిన్నాన్నవైపు చూస్తూ అంది –

"మీరు బావున్నారా..."

ఆ మాట చిన్నాన్న వినలేదు..

"నన్ను క్షమించు సుభా... ఆ మాట అనడానికి కూడా నాకర్హత లేదని తెలుసు. అయినా తప్పు నాకు తెలిసొచ్చింది. నిన్నుత్తినే అనుమానించాను. అనవసరంగా బాధించాను... రాక్షసుడిలా ప్రవర్తించాను. నువ్విలా చేస్తావనుకోలేదు. ఆ తర్వాత నిన్ను వెదకని చోటు లేదు తెలుసా. పిచ్చివాడిలా తిరిగాను... నువ్వెళ్ళిన తర్వాత నా బ్రతుకు నరకమైపోయింది. సంతోషం లేదు. శాంతిలేదు. ఏదో బ్రతికి ఉన్నాననడానికి తిని తిరుగుతున్నాను

తప్ప... జీవచ్ఛవంలా ఉన్నాను. కానీ నువ్వు కనబడతావని ఆశతోనే బ్రతికున్నాను. నా ఆశ వమ్ము కాలేదు. నీ స్వేచ్ఛకి నేనడ్డం రాను. నీ ఇష్టమొచ్చినట్లుగా ఉండొచ్చు. మనింటికొచ్చి...'' మగవాడు వోడిపోయి తనకేవిలువా లేదని తెలిసినప్పుడు ఆడదాన్ని నమ్మించడానికి, ఆడదాన్ని సంతోషపెట్టి లొంగదీసుకోడానికి ఏ మాటలు మాట్లాడాలో అలాగే అమాయకుడిలా మాట్లాడాడు చిన్నాన్న.

"మీరే సర్వస్వం అనుకొని కొండంత ఆశతో వచ్చినప్పుడు, మీరు నన్ను ఘోషాలో పెట్టి అనవసరమైన అనుమానాలతో, స్వార్థంతో, ఆడదనే... మూడు ముళ్ళేసిన భార్య అనే సానుభూతి కూడాలేక అందర్నీ వదులుకొని నమ్మి వచ్చిందన్న జ్ఞానం లేకుండా, హృదయం లేకుండా, ప్రవర్తించారే ఆనాడు. పిసరంతైనా మీరు ఆలోచించారా... మీరు పెట్టే బాధలు పడలేక, పుట్టింటికెళితే మొగుణ్ణి వదిలేసి బరి తెగించిందంటారని నా దారిన నేనొచ్చేస్తే... లేచి పోయిందని పుకార్లు లేవదీసి, చచ్చిపోయిందని శ్రాద్ధాలు పెట్టేసిన వ్యక్తి కోసం... ఇన్నాళ్ళూ మీరు ఆశగా ఎదురు చూస్తున్నారంటే ఎవడు నమ్ముతారు. నేనేం కొయ్యబొమ్మనా మీరు మూలన పడేస్తే కదలకుండా ఉండడానికి, టెబిల్ మీద పెట్టుకుంటే కళకళ్ళాడ్డానికి. నేనూ చీమూ, నెత్తురూ ఉన్న మనిషిని. నీ స్వేచ్ఛకి నేనడ్డురాను, మనింటికొచ్చీమని ఎలా అనగలిగారా మాటలు..''

పిన్ని నోట్లోంచి ఒక్కొక్క మాట తూటాలా దూసుకొస్తోంది. జన సమ్మర్థమైన స్టేషన్‌లో మేం ముగ్గురమే ఉన్నట్లుగా అనిపించింది నాకు. పిన్ని గొంతుక బొంగురుగా అయిపోయింది. పిన్ని కళ్ళల్లో కన్నీళ్ళు కంది గింజల్లా కదులుతున్నాయి.

దూరంగా మెరుస్తున్న పెద్ద కళ్ళతో బరువు బరువుగా పాకుతున్న అడవి కొండచిలువలా రైలు వస్తోంది.

"సుభా..'' చిన్నాన్న పిన్ని రెండు చేతులూ పట్టుకుని కళ్ళళ్ళోకి చూశాడు. పిన్ని చిన్నాన్న రెండు చేతుల్నీ విదిలించేసుకుంది.

"ఇదే నా ఆఖరి మాట... నా కళ్ళల్లోకి చూసి చెప్పు... నన్నన్యాయం చేస్తావా..'' చిన్నాన్న చాలా జాలిగా అన్నాడు.

"నేను మిమ్మల్ని అన్యాయం చేస్తానా... మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. ఈనాడు మిమ్మల్ని ఆదుకోవడానికి ఆడ దిక్కులేదనేసరికి నేనవసరం

వచ్చానా... ఇన్నాళ్ళూ ఏమైంది ప్రేమ. మీరు నన్నన్యాయం చెయ్యగలిగారు గాని నేను, నన్నే నమ్మిన ఇంకో మగవాడికి అన్యాయం చేయలేను. నేను ఒక్క క్షణం ఇంట్లో కనబడకపోతే సుభా ... సుభా...అని కలివిడి పడిపోయే ఆయన్ని వదులుకోలేను. అమ్మా ... అమ్మా... అని నా రక్తంలో రక్తమై నా ప్రాణంలో ప్రాణమై నా నుండి చీల్చుకు వచ్చిన నా చిన్నారి పిల్లల్ని అందరినీ విడిచిపెట్టేసి ... మీ స్వార్థం కోసం నేను రాలేను..."

ఆ దేదీప్యమానమైన దీపాల వెలుగుల్లో దేవతలా కనిపించింది.

"వస్తాను బాబూ" నన్ను పట్టుకుని పిన్ని ఏడ్చింది. నా వళ్ళంతా తడిమి నన్ను గుండెల కదిమేసుకుంది. నా కళ్ళల్లోకి కాంతివంతంగా చూస్తూ కనురెప్పల మీద ముద్దుపెట్టుకుంది.

రైలెక్కి సామాన్లు సర్దుకుని తలుపు దగ్గర కొచ్చి నిలబడింది పిన్ని.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్ పిన్నీ..." రైలు కదిలింది. మోచెయ్యి పైకెత్తి భుజానికి కళ్ళానిచ్చి కన్నీళ్ళన్ని అదుపులో పెట్టుకుంటోంది పిన్ని.

ప్లాట్‌ఫారం ఆ చివర వరకూ పరిగెత్తాను.

పట్టాలు మలుపు తిరిగే వరకూ రైలు కిటికీలో నుంచి పిన్ని చెయ్యి వూపుతూనే ఉంది.

మసకమసకగా పిన్ని కనబడేవరకూ కళ్ళు పెద్దవి చేసుకొని, చూపుల్ని చీల్చుకుని చూసాను. పిన్నితో కొండంత వెలుతురు వెళ్ళిపోయింది.

చీకటిలాంటి దుఃఖం నన్నొకసారి కమ్మేసింది.

*ఆంధ్రప్రభ వీక్లీ, 28-2-1979*

*